# పెండ్లి ఏడుపులు, పెండ్లి వస్తువుల జాబితా

నల్గొండ జిల్లా చందుపట్ల గ్రామ వాస్తవ్యులయిన శ్రీ రాఘవాచార్యులు గారు ఉద్దండ సంస్కృతాంధ్రభాషా పండితులు. వారు చెప్పిన మెరుపు తునకల వంటి కొన్ని పద్యమాలికా సుమాలు ఇప్పుడు చూద్దామా?

## పెండ్లి ఏడుపులు

సంభావనేదంచు సకల బ్రాహ్మణులేడ్వ
తాంబూలమేదంచు తరుణులేడ్వ
బాజాభజంత్రీలు బత్తెంబునకు ఏడ్వ
పప్పుకూటికి పెండ్లి బాపడేడ్వ
రెండవ పెండ్లంచు పెండ్లికూతురు నేడ్వ
పోరి చిన్నదని పెండ్లి పోరడేడ్వ
వచ్చిన చుట్టాలు ఫలహారములకేడ్వ
ముత్తైదులందరు బొట్టుకేడ్వ
చావు పెండ్లని డప్పు చాటువారలు నేడ్వ
బ్రతుకు పీంగును మోయ రజకులేడ్వ

ఇలా గొప్పగా నడుస్తుంది ఈ పద్యం

వివాహానికి అవసరమయ్యే సర్వ వస్తువుల జాబితా కోసం ఒక
సీసమాలిక అల్లిన ఘన కవి పేరు

శ్రీ చందుపట్ల పురీ జానకీరామ
కరుణాకటాక్ష వీక్షణముచేత
పెండ్లిండ్లకును దెచ్చు వివిధ వస్తువులన్ని
మరచిపోదురటంచు మదిని దలచి
గూర్చి చెప్పెద మర్త్యకోటికి తెలియంగ
భాసురంబగు నొక్క సీసమాల
శ్రీ పెరంబుదూరు శ్రీరాఘవాచార్యుండ

పసుపు, కుంకుమ, కాచు, భాగములును
బుక్కాగులా, ల్కాంతి పుష్పజాతంబును
బాదామి ఖర్జూరపండ్లు, ద్రాక్ష
సారపల్కులు, పంచదార, కొబ్బరి, గసా
లల్లంబు, కొత్తిమిరుల్లి, గడ్డ
మిర్చి, మంచింగువ, మెంతులు, మిర్యాలు,
జీలకట్టావాలు, చింతపండు,
ధన్యాలు, షాజీర, దాల్చినె, జాపత్రి,
వాము, బెల్లంబు లవంగములును,

ఉప్పు, బియ్యము, శంగపప్పు మిన్ములు, పెసల్,
నువ్వులు, గోధుమల్, నూనె, నెయ్యి,
కందిపప్పును, జాజికాయ, తేనెయు, గ్యాసు
నూనె, వెల్లుల్లియు, సాన, చెక్క,
తమలపాకులు, చిరాతల మసాలయు, నూదు
బత్తీలు, నేలకుల్, పైడిపత్రి
హారతికర్పూర, మత్తరు, పన్నీరు,
సెంటు, సబ్బులు, క్రొత్తజీడిపల్కు,
లద్ధముల్, తెలి మడ్పుల మర కాటుకడబ్బి
చిన్నగ్గిపెట్టెలు సున్నిపిండి
మానుగ కొబ్బరినూనె, సీకాయల -
పొడి, సోల, చీపురు పొడుగు సుల్లి
తాటచాపలు, కత్తిపీటా, ముదము శొంఠి
కత్తెర నిప్పు కొంగ్రొత్త విలువ
చీరలు, రవికలు సిల్కు జాకెట్లును
చెడ్డీలు, లంగాలు, చెక్క బొమ్మ,
దువ్వెన, ల్పట్టుంచు దోవతుల్, చేటలు
మొంటెలు, మధుపర్కమును, దుశాల
శెల్లాలు, పాగాలు, చిత్రమౌ తెరబట్ట
లాల్చీలు దస్తి, పల్చని తువాలు,
మట్టెయ, ల్గోలుసులు, మంగళసూత్రంబు,
నుత్తరజందెంబు లుంగరములు

నాణ్యమౌ నొక ప్రధానపు వంకు కుంకుళ్ళు,
మణి మయ స్వర్ణభూషణము లలర
కుండలు, ముంతలు, కుందెన, పేరుపుల్,
పాలకి మూకుళ్ళు, ప్రమిద జోళ్ళు,
పంటిపుల్లలు, బొగ్గు, వాసాలు, గుంజబు
బొక్కెన, చేత్రాడు, పుట్ట మన్ను,
తడకలు, కమ్మలు, త్రాళ్ళు, పూతల మన్ను,
వంటకట్టెలు, గడ్డి, పాళు, పెరుగు,
పాలగంపలు, మోమిబత్తీల్లు, దివిటీలు,
చుట్టీలు, కందిళ్ళు, సున్న మగరు
మామిడాకులు, తలంబ్రాలు, సమిధలు, జాజు
కాణివిస్తళ్ళును, కంకణములు
నిత్తడిశెమ్మెలు, వత్తులు ధూమ్ర ప
త్రంబును, సిరిదెట్లు, దారపుండ
లును, నవధాన్యంబులును, పెండ్లిపీటయు,
పిడక, తెరువును, గద్దెపీట, దర్భ
కొట్టంపురోకళ్ళు, కుదురు విసుర్రాయి,
పసగల్లు జరిపెల్లు, భాషికములు,
కులదేవతార్చక కుజుశాఖ, నల్లన
కలుకదీర్పగ పాదుకలును, దూడ
తగులు, గొంగడి, గొడ్లు, తాంబూలమును, చెంబు
కుందులు పళ్ళెంబు బిందె వంట

పాత్ర లన్నము వార్చు పట్టు, రకాలయిన
ఫలహార ములు మంత్రబ్రాహ్మణుండు,
వంటజేసెడివారు, గంటెలు, చెంచాలు
కూరగాయలు చూచి కోయువారు
బాజా భజంత్రీలు, పల్లకీ మేళంబు
డప్పులు, కొమ్ము తాళ ములజోడు
బ్రాహ్మణాశీర్వాద వాక్కులు తోడుగా
నాడుబిడ్డల మంగళారతులును.
స్టూలు, కుర్చీలు, మేజులు, కప్పుసాసర్లు
టీగాచు గిన్నె తట్టియలు గ్లాసు
లును కనుకింపు భోజనశాల చెత్త
చెదారంబు సరిజేయ దగిన జనులు.
మురిప మొసగగ సుముహూర్తమునకు పెండ్లి
జేయ సత్కీర్తి గలుగు మపాయమెరిగి
సద్గుణోల్లాస నత భక్త జన విలాస
స్వర్ణమయవాస! శ్రీచందుపట్లవాస!

స్థూలంగా లెఖ్ఖ చూస్తే రెండువందల పాతిక వరకు వస్తువులు ఈ సీసమాలికలో సుమాలయి సౌరభం వెదజల్లుతూ ఉన్నాయి. ఇలాంటి పద్యం ఆశువుగా చెప్పిన కవిగారికి సహస్రకోటి వందనాలు.

Keywords: peLLi vastuvulu, penDli vastuvulu, peLLi EDpulu, penDli EDupulu, SrI rAghavAcAryula vAru, sIsamAlika padyamulu, sIsa padyam, chandupaTla grAmam, nalgonDa jillA kavulu, kavitalu